ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
శనివారం 15 నవంబరు 2025



బాల్య వివాహాలను అరికట్టాలి

చౌదరిగూడ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టి, బాలల హక్కులను కాపాడుదామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివరాణి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తూంపల్లిలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి, గ్రామస్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఎవరైన చిన్నారులకు బాల్య వివాహ ం చేస్తే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి నరేష్, అంగన్వాడీ టీచర్ సంగీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చలి పంజా!

ఉమ్మడి జిల్లాలో ప్రజలు గజగజ

- గణనీయంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- సాయంత్రం నుంచే చల్లని గాలుల ఉధృతి
- మోమిన్‌పేటలో 8.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- మంగల్‌పల్లిలో 8.8 డిగ్రీలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో చలి పంజా విసురుతోంది. పలు ప్రాంతాల్లో గణనీయంగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో రికార్డుస్థాయిలో 8.7డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మంగల్‌పల్లిలో 8.8 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో ఇవే అత్యల్పం కావడం గమనార్హం. సాధారణంగా నవంబర్, డిసెంబర్ నెలలో ఉమ్మడి జిల్లాలో 10డిగ్రీల లోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. కానీ ఈ ఏడాది నవంబర్ రెండో వారంలోనే అనేక మండలాల్లో ఉష్ణోగ్రతలు 10 డిగ్రీలలోపు పడిపోయాయి. చలిగాలుల ఉధృతి పెరగడంతో రాత్రిళ్లు జనం బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. రాత్రి ఏడుగంటల తరువాత రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. తెల్లవారు జామున మంచు విపరీతంగా కురుస్తోంది. ఉదయం వేళ మంచు రహదారులను కప్పేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రానున్న రోజుల్లో ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో పలు ప్రాంతాల్లో 5 నుంచి 6 డిగ్రీల వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో 8.7 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు కాగా, మర్పల్లిలో 9.5 డిగ్రీలు, బంట్వారం మండలం నాగారంలో 9.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మంగల్‌పల్లిలో 8.8 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. ఎలిమినేడులో 9.4 డిగ్రీలు, ఇబ్రహీంపట్నంలో 9.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక మేడ్చల్ జిల్లా బండమాదారంలో 11.1 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే ఘట్‌కేసర్ కొండాపూర్‌లో 11.2 డిగ్రీలు, కుత్బుల్లాపూర్‌లో 11.9 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇదిలా ఉంటే రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు కూడా క్రమేపీ పడిపోతున్నాయి. మూడు జిల్లాల్లోని అనేక మండలాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 27 నుంచి 28 డిగ్రీలలోపుగానే నమోదవుతున్నాయి.



తుక్కుగూడలో చలి కాగుతూ..



జిల్లాల వారీగా అత్యల్ప ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

జిల్లా	ప్రాంతం	కనిష్ఠ
వికారాబాద్	మోమిన్‌పేట	8.7
రంగారెడ్డి	మంగల్‌పల్లి	8.8
మేడ్చల్	బండమాదారం	11.1



ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు

ఘనంగా కార్తీక వనభోజనాలు

షాద్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్తీక సమారాధన పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని మహిళలు భక్తి శ్రద్ధలతో ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. ఉసిరి చెట్టమ్మా.. చల్లంగా దీవించమ్మా అంటూ మహిళలు కార్తీక సమారాధన దినోత్సవాన్ని భక్తిపారశ్యంతో జరుపుకున్నారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని ప్రశాంత్‌నగర్, శుభాష్‌నగర్ పార్కులలో, వివిధ దేవాలయాల్లో కార్తీక మాస పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్కులు, దేవాలయాల నిర్వాహకులు కార్తీక వనభోజన ఏర్పాట్లు చేశారు.



స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న సయ్యద్ జమీల్ బాష

విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి

ఇబ్రహీంపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానానికి ఎదగాలని, నైపుణ్యం పెంచుకోవడం ద్వారా మంచి భవిష్యత్ ఉంటుందని ఇబ్రహీంపట్నం టీజీఎస్పీ మూడవ బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ బాష అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని బండారు సరోజినీదేవి ఫౌండేషన్, శనగపల్లి సువర్ణ రత్నం మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్, మాతాపితరుల సేవాసదనం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 400మంది బాలికలకు స్కూల్ బ్యాగులు, బెడ్ షీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకాన్ని తగ్గిస్తూ చెడు వ్యసనాలకు దూరంగా ఉన్నత భావాలతో బావి భారత పౌరులుగా నిలవాలన్నారు. అంతేగాక సామాజిక కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐజీ విజయ్‌కుమార్, పై ట్రస్టుల నుంచి బావన్నారాయణ, ఆదినారాయణ, కోల్లా భాస్కర్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లావణ్య, విద్యా కమిటీ చైర్మన్ షాలెహా బేగం, మాజీ కౌన్సిలర్లు నాయిని సత్యనారాయణ, భర్తాకి జగన్ పాల్గొన్నారు.

6 మీటర్లే..

ఉమ్మడి జిల్లాలో సగటున భూగర్భ జలాల లోతు

ఈ ఏడాది నైరుతి కనికరించడంతో విస్తారంగా వర్షాలు కురిసి ఉమ్మడి జిల్లాలో భూగర్భజలాలు దండిగా పెరిగాయి. దీంతో యాసంగి.. రైతులకు ఆశాజనకంగా కనిపిస్తోంది. గతేడాది అక్టోబరు చివరి నాటితో పోలిస్తే మూడు జిల్లాల్లో భూగర్భజలాలు భారీగా పైకి రావడం గమనార్హం. గతంలో ఎన్నడూ లేని విధంగా మూడు జిల్లాల్లో సగటు భూగర్భ నీటి మట్టం 6మీటర్ల పరిధి లోకి పెరగడం విశేషం.

- గతేడాది కంటే భారీగా పెరుగుదల
- పట్టణ ప్రాంతాల్లోనూ ఉబికివస్తున్న గంగమ్మ
- యాసంగి సాగుపై రైతుల గంపెడాశలు
- లక్ష్యాన్ని మించి పెరగనున్న సాగు విస్తీర్ణం
- రంగారెడ్డిలో సగ భూభాగంలో 5 మీటర్లలోపుగానే..

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో గత అక్టోబర్ చివరి వరకు భారీ వర్షాలు కురవడంతో సగటుకు మించి వర్షపాతం నమోదైన విషయం తెలిసిందే. దాదాపు అన్ని మండలాల్లో విస్తారంగా వర్షాలు కురిసాయి. దీంతో చెరువులు, కుంటలు నిండటంతో పాటు భూగర్భ జలాలు పెరిగాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో వానాకాలం పంటల విస్తీర్ణం కూడా సగటుకు చేరుకుంది. దీంతో యాసంగిపై కూడా రైతులు భారీగా ఆశలు పెట్టుకున్నారు. కొన్ని చోట్ల భారీ వర్షాల కారణంగా వానాకాలంలో పత్తి, వరి ఇతర పంటలు వేసిన రైతులు దెబ్బతిన్నారు. దీంతో వీళ్ల యాసంగిలో

మిగతా 7వ పేజీలో...





భూగర్భజలాల సగటు జిల్లాల వారీగా (మీటర్లలో)

జిల్లా	2024 అక్టోబరు	2025 అక్టోబరు
రంగారెడ్డి	7.71	6.14
మేడ్చల్	8.84	6.01
వికారాబాద్	7.77	6.17

గతేడాదితో పోలిస్తే...

గత ఏడాది అక్టోబర్‌తో పోలిస్తే ఈ ఏడాది అక్టోబర్ చివరి నాటికి భూగర్భ జలాలు గణనీయంగా పెరగడం విశేషం. గత ఏడాదితో పోలిస్తే మేడ్చల్ జిల్లాలో అత్యధికంగా 2.83 మీటర్లు సగటు భూగర్భజలాలు పెరిగాయి. అలాగే వికారాబాద్ జిల్లాలో 1.60 మీటర్లు, రంగారెడ్డి జిల్లాలో 1.57 మీటర్ల చొప్పున పెరిగాయి.

49శాతం భూభాగంలో సగటు 5 మీటర్లలోపే..

ఇదిలా ఉంటే రంగారెడ్డి జిల్లాలోని 49శాతం భూభాగంలో 0-5 మీటర్లలోపుగానే భూగర్భజలాలు ఉండడం గమనార్హం. 34శాతం భూభాగంలో 5-10 మీటర్లలోపు, 12శాతం భూభాగంలో 10 నుంచి 15 మీటర్లలోపు, 5 శాతం భూభాగంలో 15-20 మీటర్లలోపు, చౌదరిగూడెం మండలంలోని తిమ్మాయిపల్లిలో అత్యధికంగా 19.21మీటర్లకుపైగా భూగర్భజలాలు పెరిగాయి.

ఉమ్మడి జిల్లాలో వర్షపాతం(మి.మీలలో)

జిల్లా	సగటు	వర్షపాతం	పెరుగుదల శాతం
రంగారెడ్డి	662.7	985.8	49
వికారాబాద్	753.1	1061.4	41
మేడ్చల్	712.2	936.7	31

ఉత్తమ సాహిత్యం సమాజానికి

ఉపయోగకరం

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం



క్లాప్ కొడుతున్న కోదండరాం

మొయినాబాద్ రూరల్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): సాహిత్యంతో కూడిన పాటలు సమాజానికి ఉపయోగకరంగా ఉంటాయని ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడి తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ వార్డులో చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకమైన పాటను చిత్రీకరించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కెమెరా స్టార్ట్ చేసి షూటింగ్ ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర శిశు సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వల సుజాత, మా భూమి సినిమా డైరెక్టర్ నర్సింగ్‌రావు, పాట రచన నేర్నాల కిషోర్, రమాదేవి, పురుషోత్తం రెడ్డి, కుమార్, బ్యాగరీ రాజు, మేకగూడెం బిక్షపతి, కొట్టం సంపత్‌కుమార్, కుమ్మరి జనార్దన్, సంపత్ పాల్గొన్నారు.



ఐదు తరగతులకు ఒకే టీచర్

- అదనంగా మరొకరిని కేటాయించాలని గ్రామస్తుల వినతి

7



క్లెయిమ్ చేయని ఆస్తుల హక్కు దారులకు సెటిల్‌మెంట్ లెటర్‌లను అందజేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

క్లెయిమ్ చేయని ఆస్తులను తిరిగి పొందండి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

ఇబ్రహీంపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): క్లెయిమ్ చేయని ఆర్థిక ఆస్తుల హక్కుదారులు తమ బ్యాంకులు, ఇతర సంస్థలను సంప్రదించి నిధులను తిరిగి పొందాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సూచించారు. బ్యాంకు డిపాజిట్లు, వాటాలు, డివిడెంట్లు, మ్యూచువల్ ఫండ్స్, బీమా ఆదాయాలు మొదలైన వాటిని క్లెయిమ్ చేసుకోవడానికి వీలు కల్పిస్తున్నారని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'మీ డబ్బు.. మీ హక్కు' కార్యక్రమంలో క్లెయిమ్ చేయని డిపాజిట్ల పరిష్కారంపై జిల్లా స్థాయి అవగాహన, ప్రచార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక సేవల విభాగం ఆదేశాలకు అనుగుణంగా 'మీ డబ్బు.. మీ హక్కు' కార్యక్రమం నిర్వహించడం మంచి పరిణామమన్నారు. అనంతరం ఎస్‌బీఐ డీజీఎం ప్రియబ్రత మిశ్రా మాట్లాడుతూ క్లెయిమ్ చేయని డిపాజిట్లు, పెట్టుబడులు వాటి చట్టబద్ధమైన యజమానులకు తిరిగి ఇవ్వబడతాయనేది ఈ ప్రచారం లక్ష్యం అన్నారు. ఎస్ఎల్‌బీసీ ఏజీఎం పద్మజారాణి మాట్లాడుతూ ఈ ప్రక్రియను సులభతరం చేయడానికి, ఆర్థిక పారదర్శకతను నిర్ధారించడానికి వారి సంబంధిత కమ్యూనిటీలలో అవగాహన వ్యాప్తి చేయాలన్నారు. ఎల్‌డీఎం పి.సుశీల్‌కుమార్ మాట్లాడుతూ ఆస్తులను క్లెయిమ్ చేయడంలో అన్ని బ్యాంకుల అధికారులు చురుగ్గా వ్యవహరించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాళ్లను అదనపు కలెక్టర్ సందర్శించారు. ఈ శిబిరంలో సరైన హక్కుదారులకు సెటిల్‌మెంట్ లెటర్‌లను జారీ చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు సురేష్‌మోహన్, శ్రీలక్ష్మి, రామారావు, ఉష పాల్గొన్నారు.

గ్లోబల్ సమ్మిట్‌కు స్థల పరిశీలన

- పోలీసు అధికారులకు రాచకొండ సీపీ సూచనలు



మీర్కాన్‌పేటలో స్థల పరిశీలన చేస్తున్న రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు

కందుకూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'ఫ్యూచర్ సిటీ'లో డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహిస్తున్న గ్లోబల్‌సమ్మిట్- 2025 కందుకూరు మండలంలోని మీర్కాన్‌పేట రెవెన్యూ పరిధిలో నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాచకొండ సీపీ సుధీర్‌బాబు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సమ్మిట్‌కు అంతర్జాతీయ, జాతీయ పారిశ్రామికవేత్తలు హాజరవుతున్నారని, అందుకనుగుణంగా ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్‌లో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యంగా పార్కింగ్ స్థలం, సీఎం రేవంత్‌రెడ్డి వచ్చే హెలీప్యాడ్ స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయన వెంట మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఎస్పీ నర్సింహ్మారెడ్డి, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులతో యాంటీ-నార్కోటిక్ బ్యూరో ఎస్పీ

శంకర్‌పల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీ సీతారాం తెలిపారు. దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయి కళాశాలలో శుక్రవారం ఇక్ఫాయి యాంటీ-నార్కోటిక్ సెల్, తెలంగాణ యాంటీ- నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో సంయుక్తంగా మాదక ద్రవ్యాల నివారణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇక్ఫాయి వైస్ చాన్సలర్ కోటిరెడ్డి, సలహాదారు టిసి.దాసు, రిజిస్ట్రార్ విజయలక్ష్మి, జాయింట్ రిజిస్ట్రార్ మధుసూదన్‌రావు, యాంటీ నార్కోటిక్ అధికారి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



పార్టీ జెండాలతో సందడి చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

ఎన్నికలు ఏవైనా గెలుపు కాంగ్రెస్‌దే

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ఏవొచ్చినా గెలుపు కాంగ్రెస్ పార్టీదేనని ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పదేళ్ల పాటు అధికార దాహంతో విర్రవీగిన బీఆర్ఎస్‌కు కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ప్రజలు చెంప చెల్లుమనిపించారన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ విజయం సాధించడంపై తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే కాంగ్రెస్ పార్టీని గెలిపించాయని పేర్కొన్నారు. తమ పార్టీ అభ్యర్థిని ఓడగొట్టడానికి బీఆర్ఎస్ నేతలు శతవిధాలా ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకిచ్చిన హామీలను నెరవేరుస్తున్నారనే విషయాన్ని గమనించే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఏపీ సీఎం చంద్రబాబు కాంగ్రెస్ పార్టీకి పరోక్షంగా మద్దతు తెలిపారంటూ చర్చ జరుగుతోంది..నిజమేనా అని 'ఆంధ్రజ్యోతి' విలేకరి ప్రశ్నించారు. దీనికి ఆయన సమాధానం ఇస్తూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలన్న ఆలోచనలో ఉన్నారన్నారు. ఒకవేళ ఆయన కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపితే తమ పార్టీ కూడా హర్షిస్తుందని చెప్పారు. రాబోయే లోకల్ బాడీ ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతమవుతాయని చెప్పారు. సమావేశంలో పార్టీ నేతలు రఘునాయక్, బాలరాజుగౌడ్, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సంబురాలు

జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపును హర్షిసూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంబురాలు జరిపారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను పార్టీ కార్యకర్తలు భుజాలపై ఎత్తుకోవడంతో పార్టీ జెండాలను చేత బూని నృత్యం చేశారు. బాణాసంచా కాల్చి కార్యకర్తలు డ్యాన్స్‌లు చేస్తూ జై శంకరన్న అంటూ నినాదాలు చేశారు.

మాధవన్‌జీ ఆస్పత్రిలో సీఎం సహాయ నిధి సేవలు

మహేశ్వరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మాధవన్‌జీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఇకనుంచి ముఖ్యమంత్రి సహాయ నిధి సేవలు కూడా కొనసాగుతాయని, హాస్పిటల్‌కు అనుబంధంగా నర్సింగ్ కళాశాల కొనసాగింపునకు ప్రభుత్వ అనుమతి లభించిందని మాధవన్‌జీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ పి.తరుణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మాట్లాడుతూ నగరంలోని కార్పొరేట్ ఆసుపత్రుల తరహాలోనే తమ హాస్పిటల్‌లో అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. పూర్తిగా గ్రామీణ ప్రాంతాలతో అనుసంధానమై ఉన్న మాధవన్‌జీ హాస్పిటల్ పేదలకు అనేక రకాల రాయితీలపై వైద్య సేవలు అందిస్తున్నదని పేర్కొన్నారు. తమ ఆస్పత్రి పేదలకు అందిస్తున్న వైద్య సేవలను గుర్తించిన ప్రభుత్వం సీఎం సహాయ నిధి పథకంలో హాస్పిటల్‌ను చేర్చడంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మాధవన్ జీ హాస్పిటల్‌లో అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకునేందుకు 98669 11662, 81217 61666 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆవేర్ సంస్థ కార్యనిర్వాహక కార్యదర్శి నారపంగ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో పేదల కల సాకారం

చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల/మొయినాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారమైందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం చేవెళ్ల మండలంలోని గుండాల గ్రామానికి చెందిన మంగళి లక్ష్మమ్మ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మొట్టమొదటి ఇందిరమ్మ ఇల్లు గుండాలలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. గుండాల బస్‌స్టేజీ నుంచి లక్ష్మీగూడ, సాయిరెడ్డిగూడ, జ్వాలగూడ, అల్లావాడ గ్రామాల మధ్యలో ఉన్న కల్వర్టు స్థానంలో వంతెన మంజూరు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు.



గుండాలలో ఇందిరమ్మ ఇల్లును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, నక్క బుచ్చిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, మాజీ సర్పంచ్‌లు పుష్పకుమారి గణేశ్, శైలజాఆగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని సురంగల్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు, అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గౌతంకుమార్, పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ జరంగయ్య, నాయకులు గడ్డం వెంకట్ రెడ్డి, భాస్కర్‌చారి, రాంరెడ్డి, మహేందర్ ముదిరాజ్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

నవోదయ, సైనిక్ పాఠశాలల

నిర్మాణానికి స్థల పరిశీలన



నవోదయ పాఠశాల కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

దుద్యాల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గానికి మంజూరైన జవహర్ లాల్ నెహ్రూ నవోదయ, సైనిక్ పాఠశాలల నిర్మాణానికి స్థల పరిశీలన నిమిత్తం శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ అధికారులు పర్యటించారు. దుద్యాల్ మండలంలోని హకీంపేట్ గ్రామంలో ఏర్పాటు చేయనున్న ఎడ్యుకేషన్ హబ్‌కు కేటాయించిన 240 ఎకరాల స్థలంలో సైనిక్ పాఠశాల ఏర్పాటుకు అనువైన స్థలంతోపాటు ఎన్ని పరికరాలు అవసరం అవుతాయనే విషయాన్ని పరిశీలించారు. కొడంగల్ మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ సమీపంలో గల ప్రభుత్వ స్థలంలో నవోదయ పాఠశాల నిర్మాణానికి అనువైన స్థలం ఉందా లేదా అని పరిశీలించారు. పూర్తి స్థాయి నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిపారు. త్వరలోనే వీటి నిర్మాణ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అంతకుముందు దుద్యాల్ మండలంలోని కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కమిషన్ అడిషనల్ డైరెక్టర్ రమణకుమార్, జేడీ మదన్‌మోహన్, ఆర్‌జేడీ విజయలక్ష్మి, డీఈవో రేణుకాదేవి, ప్రిన్సిపాల్ రాధిక, సూపరింటెండెంట్ రాజేశ్వర్ ప్రసాద్ పాల్గొన్నారు.

7.30 ఎకరాల్లో దెబ్బతిన్న వరి

'మొంథా' పంట నష్టంపై నివేదిక

మేడ్చల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మొంథా తుఫాన్ ప్రభావంతో మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో వరి పంటకు కొంతమేర నష్టం వాటిల్లింది. ఈ మేరకు ప్రభుత్వానికి జిల్లా వ్యవసాయ శాఖ నివేదిక పంపింది. జిల్లాలోని కీసర మండలంలో 11 మంది రైతులకు చెందిన దాదాపు 7.30 ఎకరాల వరి పంటకు నష్టం జరిగినట్లు అధికారులు గుర్తించారు. దీనికి సంబంధించి వివరాలు సేకరించి నివేదికను ప్రభుత్వానికి పంపించారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేలు నష్ట పరిహారం చెల్లించనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. అధికారుల నివేదిక ప్రకారం జిల్లాలో వరి పంట నష్టపోయిన రైతులకు రూ.77,500 అందనుంది.

జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



పతకాలతో గురుకుల పాఠశాల విద్యార్థినులు

కీసర, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ఆటల పోటీల్లో గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. కీసరలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థినులు ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు, 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు మునుగూనూరులో హైదరాబాద్ జిల్లా స్థాయి అండర్ - 14, 17, 19 విభాగాలలో కబడ్డీ, రన్నింగ్, హైజంప్, చెస్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విద్యార్థినులు పతిభ చాటి పలు పతకాలు సాధించారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయలు విద్యార్థినులను అభినందించారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన

జీవన శైలిని అలవర్చుకోవాలి

లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి



మధుమేహ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న మహేంద్రకుమార్‌రెడ్డి

కందుకూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): డయాబెటిస్ నియంత్రణకు ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. ప్రపంచ మధుమేహ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని కందుకూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో ఉచిత మధుమేహ నిర్ధారణ శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రోజులో ఎక్కువ సమయం ఇంటర్నెట్, మొబైల్ ఫోన్‌పై గడపడం వల్ల జీవ క్రియలు దెబ్బతింటున్నాయన్నారు. శిబిరంలో 73 మందికి స్క్రీనింగ్ చేయగా ఆరుగురికి కొత్తగా మధుమేహం పాజిటివ్ వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా క్యాబినేట్ కార్యదర్శి తాళ్ల అంజయ్య, క్లబ్ కార్యదర్శి తీగల జగదీశ్వర్‌రెడ్డి, కోశాధికారి కుంచకూరి వెంకటేశ్వర్లుగుప్త, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమంగా అంధత్వ నివారణ కార్యక్రమం

ఆమనగల్లు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ స్ఫూర్తితో అంధత్వ నివారణ కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ ముందుకు తీసుకువెళ్తుందని రాంరెడ్డి లయన్స్‌క్లబ్ కంటి ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ వీ.దామోదర్‌రెడ్డి అన్నారు. మరణాంతరం నేత్రదానం చేసేందుకు ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట లయన్స్ క్లబ్, రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కంటి పరీక్ష శిబిరాన్ని జిల్లా గవర్నర్ మహేంద్రకుమార్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా క్యాబినెట్ కార్యదర్శి తాళ్ల అంజయ్య, క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, సెక్రటరీ గంప శ్రీనివాస్, రీజియన్ సెక్రటరీ వెంకట్‌రెడ్డి, కంటి వైద్య నిపుణుడు చంద్రశేఖర్, నటరాజ్, యాదయ్య, కొండల్ రెడ్డి, యాదయ్య, రామ్మోహన్, కొరివి వెంకటయ్య, ఎంగిలి బాలకృష్ణ, పీఆర్‌వో పాష పాల్గొన్నారు.


బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న కార్తీక్‌రెడ్డి

అనాథలైన అక్కాచెల్లెళ్లకు ఆర్థికసాయం

చేవెళ్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మీర్జాగూడ బస్సు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన హజీపూర్‌కు చెందిన అక్కచెల్లెళ్లకు బీఆర్‌ఎస్ రాష్ట్ర యువ నాయకుడు కార్తీక్‌రెడ్డి చేయూతనందించారు. శుక్రవారం తమ వంతు సాయంగా రూ.2 లక్షలు అందించారు. మీర్జాగూడ రోడ్డు ప్రమాదంలో 19 మంది మృతి చెందగా అందులో యాలాల మండలంలోని హజీపూర్ గ్రామానికి చెందిన బందెప్ప, లక్ష్మీ దంపతులు మృతి చెందారు. దీంతో వారి ఇద్దరు కూతుళ్లు శివలీల, భవనీ అనాథలుగా మారారు. వారి పరిస్థితిని గుర్తించిన కార్తీక్‌రెడ్డి తన వంతు సాయం అందించారు.

చట్టాలపై అవగాహన అవసరం


విద్యార్థికి బహుమతి అందజేస్తున్న వెంకటేశ్వర్

వికారాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే చట్టాల గురించి అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్ అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో శివారెడ్డిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బాలల హక్కులు, బా ల్య వివాహ నిషేధ చట్టం, పోక్సో, మహిళా భద్రతా చట్టాలు, న్యాయ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మొ బైల్ వ్యసనంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. మొబైల్ దుర్వినియోగం, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ గేమింగ్‌పై వివరించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ టి.వెంకటేష్, డిప్యూటీ కౌన్సెల్ పి.రాము, పాఠశాల హెచ్‌ఎం నజిమొద్దీన్, ఉపాధ్యాయులు జబీర్, శివకుమార్, రఘురాం, ప్రణీత, భూపాల్ పాల్గొన్నారు.

నవ సమాజ స్థాపనకు కృషి చేయాలి


స్వయం పరిపాలన దినోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

వికారాబాద్, నవంబరు 14: నేటి బాలలే రేపటి పౌరులని, నవ సమాజ స్థాపనకు అంకితభావంతో కృషి చేయాలని సిద్దులూరు జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం రామకృష్ణారెడ్డి అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, ఉన్నత లక్ష్యాలే లక్ష్యంగా విద్యనభ్యసించాలని సూచించారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని, పరిపూర్ణత, మూర్తిమత్వం కలిగిన వ్యక్తులు మాత్రమే ఉపాధ్యాయులుగా రాణించగలుగుతారన్నారు. ఒక రోజు ఉపాధ్యాయ వృత్తిని నిర్వహించిన బాల బాలికలకు శుభాకాంక్షలు తెలిపారు. డీఈవోగా విద్యార్థి మాజీద్, ఎంఈవోగా హర్షవర్ధన్, హెచ్‌ఎంగా సంతోష్‌గౌడ్ వ్యవహరించారు. బోధనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.ప్రతాప్, వినోద్‌కుమార్, వెంకటేశం, ప్రతాప్, రాజు, రమేష్, బాబురావు, నరేష్, సంగీత, మీనాకుమారి, శ్రీదేవి, నాగలత, స్వర్ణలత పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి


వారోత్సవాలను ప్రారంభిస్తున్న ఏసీపీ శంకర్ రెడ్డి

మేడ్చల్ టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మేడ్చల్ పట్టణంలోని జిల్లా గ్రంథాలయ కార్యాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. సరస్వతీ నిలయాలుగా ఉన్న గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు, సీఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి టెట్‌పై అవగాహన సదస్సులు

వికారాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన టెట్ నోటిఫికేషన్ నేపథ్యంలో ఏకేఆర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమణ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 18, 19, 20 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి పొందిన లెజెండరీ ఫ్యాకల్టీలు పాల్గొని అభ్యర్థులకు మార్గదర్శనం చేస్తారని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఇంగ్లిష్ నిపుణులు రాజేంద్ర చారి, శ్రీకాకులానికి చెందిన మెతడాలజీ ఫ్యాకల్టీ రవి, వైజాగ్‌కు చెందిన సైకాలజీ నిపుణులు శివ ఈ సదస్సులకు హాజరవుతారని వివరించారు. మరిన్ని వివరాల కోసం 94410 22571 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బీసీల ఆక్రోశ సభను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల స్వామి

షాబాద్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కామారెడ్డిలో శనివారం తలపెట్టిన బీసీల ఆక్రోశ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి పిలుపునిచ్చారు. షాబాద్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాజ్యాధికారం కోసం బీసీలందరూ సంఘటితమై పోరాడాలన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో 34 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నామని తెలిపారు. బీసీల సత్తా తెలియాలంటే కామారెడ్డి ఆక్రోశ సభకు బీసీలు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు మహేందర్, శంకర్, అంజయ్య, కరుణాకర్, దామోదర్, గోపాల్, కిష్టయ్య, రాంచందర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

పులుమద్దిలో విదేశీ పర్యాటకుల సందడి


పులుమద్దిలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న విదేశీయులు

వికారాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ మండల పరిధిలోని పులుమద్ది గ్రామాన్ని ఈజిప్ట్, ఘనా, మలేషియా, ఓమాన్, బంగ్లాదేశ్, శ్రీలంక దేశాలకు చెందిన పది మంది విదేశీ ప్రతినిధుల బృందం సందర్శించింది. గ్రామంలో పల్లె ప్రకృతి వనం, కంపోస్ట్ షెడ్, స్వయం సహాయక సంఘాల అభివృద్ధి కార్యక్రమాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా విదేశీ ప్రతినిధులు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌ని కలుసుకుని గ్రామంలో అమలు చేస్తున్న అభివృద్ధి పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. పులుమద్ది గ్రామ అభివృద్ధిపై విదేశీ బృందం ప్రశంసలు కురిపించింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వినయ్‌కుమార్, సంబంధిత శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు

డీఈవో విజయకుమారి


విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న డీఈవో విజయకుమారి

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎదులాబాద్‌లోని తెలంగాణ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవానికి జిల్లా విద్యాధికారి విజయకుమారి హాజరయ్యారు. విద్యార్థులతో కాసేపు సరదాగా గడిపి అనంతరం మధ్యాహ్న భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి పౌరులని, కష్టపడి చదివి ఉన్నస్థానాలకు చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. క్రమశిక్షణ, పట్టుదలతో ఏదైనా సాధ్యమని పేర్కొన్నారు. స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆట వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో రవీందర్, ఏఈవో శ్రీధర్, జీసీడీవో హేమలత పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి నెహ్రూ పునాది వేశారు

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్/కేశంపేట/నందిగామ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధికి భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పునాది వేశారని ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. నెహ్రూ జయంతిని పురష్కరించుకొని షాద్‌నగర్‌లోని ఎల్‌ఎన్‌కాలనీలో ఆయన విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి నెహ్రూ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి, నాయకులు అగ్గనూరి విశ్వం, కొంకళ్ల చెన్నయ్య, చెంది తిరుపతి రెడ్డి, అగ్గనూరి బస్వం, ఇబ్రహీం, కరుణాకర్, ఇంజమూరి గోపాల్, రఘుమారెడ్డి, కత్తి శేఖరప్ప, పెంటయ్య, నలమోని శ్రీధర్, డిస్కో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ గ్రంథాలయంలో..

షాద్‌నగర్ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కొప్పుల మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు నక్క బాల్‌రాజ్, వీరేశం, క్యాసెట్ శ్రీనివాస్, అల్వాల దర్శన్‌గౌడ్, చీపిరి శివరాములు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేశంపేట మండలానికి సంబంధించి మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే వీర్లపల్లి లబ్ధిదారులకు అందించారు. మొత్తం 20 మందికి రూ.8,42,500 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్, ఏఎంసీ డైరెక్టర్లు భాస్కర్ గౌడ్, కరుణాకర్, యెన్నం శ్రీధర్‌రెడ్డి, రాఘవేందర్ రావు, రాములు, రాజేందర్ రెడ్డి, ఎండీ ఆమేర్, నాగేశ్వర్, మధు, ముత్యాలు, అఖిల్, శ్రీశైలం, రాజేష్ పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు

ప్రతి పేదవాడికి పక్కా ఇళ్లు నిర్మిస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. నందిగామ మండల పరిధిలోని మొదళ్ల గూడ, నర్సప్పగూడ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలకు హాజరయ్యారు. అనంతరం నర్సప్పగూడలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అలాగే నందిగామ మండల కేంద్రంలో నిర్వహించిన జూబ్లీహిల్స్ విజయోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట నాయకులు శివశంకర్‌గౌడ్, జంగ నర్సింలు, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, కావలి కృష్ణ, రవి, శికుమార్, శేఖర్, నరెందర్, అశోక్, చందన్, బాల్‌రాజ్, సిద్ధు, సురేందర్ పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో ప్రగతికి పట్టం కట్టారు

» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ప్రజలు ప్రగతిని చూసి కాంగ్రెస్‌కు పట్టం కట్టారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు తప్పుడు ప్రచారం చేసినా ప్రజలు విశ్వసించక తిప్పికొట్టారని పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి పట్ల విశ్వాసం, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పనితీరుకు జూబ్లీహిల్స్ ఫలితం నిదర్శనమన్నారు. కాంగ్రెస్ ప్రజాభిమానం ముందు బీజేపీ, బీఆర్‌ఎస్ కుట్ర రాజకీయాలు ఫలించలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరిగిన కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు జై కొట్టారని పేర్కొన్నారు. కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు యూసఫ్‌గూడ డివిజన్‌లో కష్టపడి పనిచేశారని, వారికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నాయకులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, యాట నర్సింహ, గూడూరు భాస్కర్ రెడ్డి, శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, జక్కు అనంత రెడ్డి, గుర్రం కేశవులు, భట్టు కిషన్ రెడ్డి, మండ్లీ రాములు, కాసు శ్రీనివాస్ రెడ్డి, రమేశ్ యాదవ్, బోజ్జ సాయిరెడ్డి, డోకూరు ప్రభాకర్ రెడ్డి, యాదయ్య, చేగూరి వెంకటేశ్, బీచ్యానాయక్, బీక్యానాయక్, మానయ్య, జగన్, విజయ్‌నాయక్, ప్రసాద్, బాల్‌రాజ్, ఇమ్రాన్ బాబా, శ్రీకాంత్, శ్రీశైలం, మిట్టపల్లి అంజయ్య, మహేశ్, మోహన్‌రెడ్డి, మహేందర్, పాలకుర్ల రాములు పాల్గొన్నారు.

ఐదు తరగతులకు ఒకే టీచర్

» మరొకరిని కేటాయించాలని ఎంఈవోకు గ్రామస్తుల వినతి


ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న రంగంపల్లి గ్రామస్తులు

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలంలోని రంగంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులకు ఒకే టీచర్ పనిచేస్తున్నాడని, అదనంగా మరొక ఉపాధ్యాయుడిని కేటాయించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఫరూఖ్‌నగర్ ఎంఈవో మనోహర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామ పాఠశాలలో నిర్వహిస్తున్న ఐదు తరగతులలో 24 మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు ఎలా బోధిస్తాడని ప్రశ్నించారు. అదనంగా మరో టీచర్‌ను పంపించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పురుగుల శివరాజ్, సక్కని దశరథ్, పి.రమేష్, శ్రీకాంత్, చెన్నయ్య, వెంకటేష్, సురేష్, రమేష్, వేణు పాల్గొన్నారు.

గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి

ఫరూఖ్‌నగర్ మండలంలోని రంగంపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించాలని గ్రామస్తులు కోరుతూ శుక్రవారం షాద్‌నగర్ డిపో మేనేజర్ ఉషకు వినతి పత్రాన్ని ఇచ్చారు. గ్రామానికి బస్సు రాకపోవడంతో వృద్ధులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. కిలో మీటరున్నర దూరం కాలినడకన వచ్చి బస్సు ఎక్కాల్సి వస్తుందని తెలిపారు. కనీసం ఉదయం, సాయంత్రం సమయాల్లో గ్రామానికి బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.


జ్యోతి ప్రజ్వలన చేసి వారోత్సవాలను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

జ్ఞాన సంపదను ప్రజలకు చేరువచేయాలి

» వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల్లోని జ్ఞాన సంపదను ప్రజలకు చేరువ చేయాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. శుక్రవారం జిల్లా గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. విజ్ఞానాన్ని కేవలం పోటీ పరీక్షలకు పరిమితం చేయకుండా దిన చర్యలో భాగంగా అధ్యయనం చేయాలన్నారు. నెహ్రూ, అంబేద్కర్, ఎస్ఆర్ రంగనాథన్ వంటి మహనీయుల చరిత్ర అందరికీ ప్రేరణగా నిలుస్తాయన్నారు. అనంతరం గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందించడంలో, సంస్కృతిని కాపాడటంలో, అభ్యాస ప్రక్రియను ప్రోత్సహించడంలో కీలక భూమిక పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గోట్లపల్లి అటవీ పరిధిలో భూ సర్వే


సర్వే చేస్తున్న సర్వేయర్ మహేశ్‌కుమార్

పెద్దేముల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోట్లపల్లి శివారులోని అటవీ క్షేత్రం పరిధిలో శుక్రవారం అటవీ శాఖ అధికారుల సమక్షంలో సర్వే నిర్వహించారు. గోట్లపల్లి గ్రామానికి చెందిన నర్సిములు, నర్సయ్యకు సర్వే నం.54లో 9 ఎకరాల 15 గుంటల భూమి ఉంది. ఆ భూమి అటవీ క్షేత్రానికి అనుకొని ఉండటంతో రైతులు తమ భూమి అటవీ క్షేత్రంలో లేదని, అటవీ శాఖ అధికారులు తమ పరిధిలో ఉందని తెలపడంతో అటవీ, రెవెన్యూ శాఖల సమన్వయంతో తాండూరు మండల రెవెన్యూ సర్వేయర్ రైతుల సమక్షంలో సర్వే నిర్వహించారు. అయితే ఆ భూమి సర్వేలో రైతులకు చెందినదిగా తేల్చారు. అటవీ శాఖ బీట్ ఆఫీసర్ మల్లయ్య ఉన్నారు.

6 మీటర్లే..

(ఐదో పేజీ తరువాయి)

మళ్లీ తమ అదృష్టాన్ని పరిష్కరించుకునేందుకు సిద్ధమవుతున్నారు. తాజాగా అక్టోబర్ నెలాఖరునాటికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో భూగర్భజలాల పరిస్థితిపై భూగర్భ జలవనరులశాఖ గణాంకాలను విడుదల చేసింది. దీని ప్రకారం మూడు జిల్లాల్లో భూగర్భజలాలు గతంలో ఎన్నడూ లేని విధంగా పెరిగాయి.

సాగు లక్ష్యం మించేలా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా పాతళగంగపైకి ఊబికి వస్తోంది. భూగర్భజలాలు పుష్కలంగా ఉండడం ఈ యాసంగి సీజన్‌లో పంటలు వేసే రైతులకు భరోసా దొరికింది. దీంతో యాసంగి పంటల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రధానంగా వరి పంటను లక్ష్యాలకు మించి సాగు చేయొచ్చని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అక్టోబర్ చివరి నాటికి మేడ్చల్ జిల్లాలో సగటు 6.01 మీటర్ల లోతులో, రంగారెడ్డి జిల్లాలో 6.14 మీటర్లు, వికారాబాద్ జిల్లాలో 6.17 మీటర్ల లోతులో భూగర్భనీటి మట్టాలు ఉన్నాయి. భూగర్భజలాలు పెరగడంతో యాసంగిలో పంటలకే కాకుండా వేసవిలో తాగునీటికి ఢోకా ఉండదని అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా నగర శివార్లలోని పట్టణ ప్రాంతాల్లో గణనీయంగా భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. దీంతో ఈ ప్రాంతాల్లో వచ్చే వేసవిలో శివారు మండలాల్లో నీటి ఇబ్బందులు పెద్దగా ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నారు.


ఆర్థికసాయం అందిస్తున్న మాజీ ఎంపీటీసీ యాదయ్య

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

తలకొండపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన చుక్కాపూర్ గ్రామానికి చెందిన కాలూరి వీరేశ్ కుటుంబాన్ని శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. ఆయన మృతి పట్ల సంతాపం తెలిపి కుటుంబాన్ని పరామర్శించారు. ఏమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పాండు రంగారెడ్డిలు రూ.5 వేలు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి రూ.3 వేలు, మాజీ సర్పంచ్ కిష్టమ్మ రూ.వెయ్యి సమకూర్చారు. మాజీ ఎంపీటీసీ దాసరి యాదయ్య మృతుడి కుటుంబానికి అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు తాహేర్, కుమార్, నాని, యాదయ్య, భిక్షపతి, లక్ష్మణ్, పోచయ్య, రాములు, తదితరులున్నారు. అలాగే తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన రామస్వామి అనారోగ్యంతో మృతిచెందాడు. మాల మహానాడు చిట్టి సభ్యులు రూ.12 వేలు సమకూర్చి బాధిత కుటుంబానికి అందజేశారు.



ప్రమాదకరంగా ప్రయాణం

» వ్యాన్‌లో విద్యార్థులను కుక్కి విహారయాత్రకు తరలింపు

» ఆందోళనలో తల్లిదండ్రులు

ఇటీవల జరిగిన ప్రమాదాలతో ప్రజలు రోడ్డెక్కాలంటేనే జంకుతున్నారు. ఇదిలా ఉంటే ఓ స్కూల్ యాజమాన్యం మాత్రం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. వికారాబాద్ పట్టణంలోని వైష్ణవి పాఠశాల నుంచి విద్యార్థులను చిల్డ్రన్స్ డే సందర్భంగా మోమిన్‌పేట మండలం వెల్‌చాల్‌కు శుక్రవారం విహార యాత్రకు తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే పిల్లలను గొర్ల మందను తరలించిన విధంగా వ్యాన్‌లో కుక్కి తీసుకెళ్లడం కన్పించింది. పిల్లలు సీట్ల వెనుకాల నిలబడి ఉండగా ఆ వాహనం స్పీడ్‌గా వెళ్లడంతో అటుగా వెళ్లే వారు వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో విషయం బయటకు వచ్చింది. ఆ పిల్లలకు ఏమైనా జరిగితే ఆ కుటుంబాల పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే కాకుండా పట్టణంలోని అనేక పాఠశాలల యాజమాన్యాలు సైతం ఇదే విధంగా విద్యార్థులను తరలిస్తున్నారు. సీటింగ్ ప్రకారం బస్సులో ప్రయాణం చేసే విధంగా బస్సులు, మినీ వ్యాన్‌ల ఫిట్‌నెస్‌లను కూడా పరిశీలించిన తరువాతనే అధికారులు అనుమతులు ఇవ్వాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

- వికారాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి)

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

- నవీన్ యాదవ్ గెలుపును హర్షిస్తూ వేడుకలు
- బాణసంచా కాల్చి.. మిఠాయిలు పంచిపెట్టిన నాయకులు


ఆమనగల్లు : విజయోత్సవ ర్యాలీలో నాయకులు


కందుకూరు : హైదరాబాద్-శ్రీశైలం హైవేపై బాణసంచా కాల్చుతున్న జంగారెడ్డి నాయకులు

శంకర్‌పల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమ పథకాలే జూబ్లీహిల్స్‌లో నవీన్ యాదవ్ గెలుపునకు కారణమైందని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. నాయకులతో కలిసి శంకర్‌పల్లిలో సంబరాలు జరుపుకున్నారు. టపాసులు కాల్చి ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ చంద్రమోహన్, నాయకులు గోపాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, ప్రశాంత్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఆమనగల్లు : నవీన్ యాదవ్ ఘన విజయం సాధించడాన్ని హర్షిస్తూ రాజీవ్ చౌక్ వద్ద మండలాధ్యక్షుడు జగన్, యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, కార్యకర్తలు జాతీయ రహదారిపై బాణసంచా పేల్చి మిఠాయిలు పంచారు. విజయ్ నాయక్, కానుగుల దశరథం, శ్రీశైలం, ఖలీల్, ఖాదర్ ఖాద్రి, ప్రసాద్, బాబా, రాఘవేందర్, తదితరులున్నారు.

కడ్తాల్ : కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బాణసంచా పేల్చి ప్రజలకు మిఠాయిలు పంచారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గీతా నర్సింహ, చేగూరి వెంకటేశ్, లక్‌పతి నాయక్, జహంగీర్‌అలీ, జహంగీర్‌బాబా, పర్వతాలు, తదితరులు పాల్గొన్నారు. మైసిగండిలో నిర్వహించిన వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తలకొండపల్లి : కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కాసు శ్రీనివాస్ రెడ్డి, మోహన్‌రెడ్డి, మిట్టపల్లి అంజయ్య, అజీం, రవీందర్ యాదవ్, కృష్ణ, తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.

మాడ్గుల : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మాజీ ఎంపీపీ జంగయ్య, రేవంత్ మిత్రమండలి అధ్యక్షుడు భాస్కర్, శ్రీను, శివ, తదితరులున్నారు.

మహేశ్వరం : ఉప ఎన్నిక విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని స్థానిక ఎన్నికల్లోనూ విజయం సాధించేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పరుస్తున్న ప్రతీ సంక్షేమ పథకం ప్రజలకు అందేలా కార్యకర్తలు పని చేయాలన్నారు. మాజీ ఎంపీపీ కె. రఘుమారెడ్డి, నాయకులు కాకి ఈశ్వర్, జానకీరామ్, కుమార్, యాదయ్య, రాజునాయక్, దేవేందర్ నాయక్, నర్సింహ, జంగయ్య తదితరులు ఉన్నారు.

శంషాబాద్ : నవీన్‌యాదవ్ విజయంతో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచి సంబురాలు జరుపుకున్నారు. సంజయ్‌యాద్, శ్రీధర్, వంశీ, జెల్లపల్లి నరేందర్‌తో పాటు అశోక్, తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల : కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు బి.శ్రీనివాస్‌గౌడ్‌లు హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై నాయకులతో కలిసి టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ పాండుయాదవ్, సీనియర్ నాయకులు ఎం.కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఆగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, ప్రభాకర్, నాయకులు కార్యకర్తలన్నారు.


శంషాబాద్ : సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు


కేశంపేట : బాణసంచా పేల్చుతున్న నాయకులు

చౌదరిగూడ : మండలాధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. రజిత, అంజనేయులు, నర్సింహులు, నీలయ్య, రాజేశ్, బాలయ్య, మోహన్, అంజి, సత్యయ్య, అప్సర్, యాదగిరి ఉన్నారు.

కొందుర్గు : నవీన్ యాదవ్ గెలుపు పట్ల మండల పరిధిలోని రాంచంద్రపూర్ చౌరస్తాలో నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మండలాధ్యక్షులు కృష్ణారెడ్డి, ఎండీ జహంగీర్, మహిపాల్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, గోవర్ధన్ గౌడ్, గౌస్, షబ్బీర్, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

షాబాద్ : గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్ మండల కేంద్రంలో నాయకులతో కలిసి స్వీట్లు పంచుకొని సంబురాలు జరుపుకున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నయ్య, సర్దార్‌నగర్ ఏఎంసీ డైరెక్టర్ అక్తర్, మాజీ ఎంపీటీసీలు రవీందర్, చెన్నయ్య, అశోక్, సర్పంచులు జనార్దన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు రాహుల్‌గుప్తా, ఖుద్దూస్, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : నవీన్‌కుమార్ గెలుపు ప్రజా విజయమని, ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా ఓటర్లు అభివృద్ధికే పట్టం కట్టినట్లు మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి అన్నారు. పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, నాయకులతో కలిసి హైద్రాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై సంబురాలు జరుపుకున్నారు. డైరెక్టర్లు కె.విష్ణువర్ధన్‌రెడ్డి, అఫ్జల్‌బేగ్, ఎస్.వెంకటేష్‌గౌడ్, ఎస్టీ అజీజ్, మోహీన్, జి.సుధాకర్‌రెడ్డి, సరికొండ జగన్, గోపాల్‌రెడ్డి, ఎస్.ప్రతాప్‌రెడ్డి, తదితరులున్నారు.

కేశంపేట : కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గూడ వీరేశ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బాణసంచా పేల్చి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మహిళా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుండె రాణి, అనసూయమ్మ, రావుల పెంటయ్య, కరుణాకర్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.


చౌదరిగూడ : టపాసులు కాల్చుతున్న నాయకులు


చేవెళ్ల : సంబురాల్లో కాంగ్రెస్ నాయకులు

క్రైం కార్నర్

9 ఎకరాల భూమికి టోకరా

- నకిలీ పత్రాలు సృష్టించి ఇతరులకు విక్రయం
- ఆరుగురు సభ్యుల ముఠా అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు


పోలీసుల అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న పరికరాలు

మహేశ్వరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలతో రూ.కోట్ల విలువైన భూమిని కాజేసేందుకు యత్నించిన ముఠా గుట్టును రట్టు చేశారు మహేశ్వరం పోలీసులు. కందుకూరు మండలం ధన్నారం గ్రామానికి చెందిన చుక్క శ్రీకాంత్, అచ్చంపేటకు చెందిన నేనావత్ కిషన్‌నాయక్, మాడ్గుల మండలం సుద్దపల్లికి చెందిన పందుల దౌలయ్య, ఆమనగల్లుకు చెందిన తడెం మహేష్, ఎల్బీ నగర్‌కు చెందిన చోలేటి రాఘవాచారిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మహేశ్వరం సీఐ. వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. మహేశ్వరం మండలంలోని తుమ్మలూరు గ్రామ రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 247/5లో గల రామిడి యాదవ లక్ష్మీకాంత్‌రెడ్డికి చెందిన 9.04 ఎకరాల భూమికి సంబంధించి నకిలీ పత్రాలు తయారు చేయడంతో పాటు సదరు రైతు ఆధార్‌కార్డు వివరాలను మార్చి అసలు రైతుకు తెలియకుండానే ఇతరులకు భూమిని విక్రయించారు. విషయం తెలుసుకున్న రైతు లక్ష్మీకాంత్‌రెడ్డి సోదరుడు రమాకాంత్‌రెడ్డి ఈనెల 12న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నకిలీ పత్రాలు తయారు చేసిన ఆరుగురిని 14న శుక్రవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఈమేరకు వారి నుంచి 4 సెల్‌ఫోన్లు, పట్టాదారు పాస్‌బుక్ కాపీ, నకిలీ ఆధార్‌కార్డు, చెక్కులు, సీపీయూ, మానిటర్, ల్యాప్‌టాప్, ఐరిష్ మిషన్, ఫింగర్ ప్రింట్ స్కానర్‌ను స్వాధీనం చేసుకొని కోర్టులో డిపాజిట్ చేసినట్లు సీఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ కింద పడి కూలీ మృతి

షాద్‌నగర్ రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఇసుక ట్రాక్టర్ టైర్ కిందపడి కూలీ మృతిచెందాడు. ఫరూఖ్‌నగర్ మండలం కాంసాన్‌పల్లి గ్రామ పంచాయతీ శివారులోని నాగర్లగడ్డ తండా సమీపంలో గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై రాజేశ్వర్ కథనం ప్రకారం.. బాలానగర్ మండలం సూరారం శివారులోని వాగులో ట్రాక్టర్‌లో ఇసుక నింపుకొని ఫరూఖ్‌నగర్ మండలం చౌల్లపల్లికి రాత్రిపూట వస్తున్నారు. ఈక్రమంలో నాగర్లగడ్డ తండా సమీపంలోకి రాగానే ట్రాక్టర్‌పై కూర్చున్న దుబ్బ భిక్షపతి(55) అదుపుతప్పి టైరుకింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాక్టర్‌ను నరేశ్ అనే వ్యక్తి నడుపుతున్నట్లు తెలిపారు. గ్రామస్థుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు అదే రాత్రి మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. మృతుడు భిక్షపతి కుమారుడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్‌ను సీజ్‌చేసి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరేసుకొని యువతి ఆత్మహత్య

మాడ్గుల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం ఛత్తీస్‌ఘడ్ నుంచి తెలంగాణకు వచ్చిన యువతి ఉరేసుకొని యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఛత్తీస్‌గడ్‌లోని బీజాపూర్ జిల్లాకు చెందిన రోహిణి హేమ్లా(21) మండల పరిధిలోని అన్నెబోయినిపల్లి సమీపాన గల వెంకటేశ్వర పౌల్ట్రీఫామ్‌లో కొన్నేళ్ల క్రితం పనికి కుదిరింది. ఈనెల 10న తన స్నేహితురాలు అనితకు ఫామ్ నుంచి బయటికి వెళుతున్నానని చెప్పి తిరిగి రాలేదు. ఈమేరకు పౌల్ట్రీఫామ్ సూపర్‌వైజర్ బొర్ర లక్ష్మయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ వేణుగోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా పౌల్ట్రీఫామ్ సమీపాన ఓ చెట్టుకు ఉరేసుకొని చనిపోయినట్లు సమాచారం అందుకున్నారు. ఈమేరకు శుక్రవారం పోలీసులు హేమ్లా మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మోదీపై విశ్వాసానికి బిహార్ ఫలితమే నిదర్శనం


కందుకూరు : నాయకులతో కలిసి సంబురాలు జరుపుకుంటున్న బొక్క నర్సింహారెడ్డి

ఆమనగల్లు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎన్డీయే ప్రభుత్వ పనితీరు, ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రజల విశ్వాసం మరోసారి రుజువైందని, బిహార్ ఎన్నికల ఫలితాలు అందుకు నిదర్శనమని బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మోదీ నాయకత్వంలోనే దేశ సమగ్రాభివృద్ధి, సుస్థిర పాలన, భద్రత సాధ్యమని దేశ ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. ఈ విషయం బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయంతో స్పష్టమైందని, కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరించారన్నారు. దేశంలో బీజేపీ తిరుగులేని శక్తి అని మరోసారి రుజువైందన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలోనూ బీజేపీదే అధికారమని ఆయన అన్నారు.

చేవెళ్లలో బీజేపీ నాయకుల సంబురాలు

చేవెళ్ల : బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించడం హర్షణీయమని బీజేపీ చేవెళ్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు అనంతరెడ్డి తెలిపారు. ఈమేరకు చేవెళ్లలో టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. బీజేపీ నాయకులు కుంచం శ్రీనివాస్‌గుప్తా, అంజనేయులుగౌడ్, శర్వలింగం, మాణిక్యరెడ్డి, జయసింహారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, బాలరాజు, శ్రీనివాస్, మధుకర్‌రెడ్డి, అశోక్, సత్యనారాయణ, వెంకటేశ్, రాజు, అభిషేక్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


చేవెళ్ల : స్వీట్లు తినిపించుకుంటున్న బీజేపీ నాయకులు


షాద్‌నగర్ అర్బన్ : మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

బిహార్‌లో 'డబుల్ ఇంజన్'కే పట్టం

షాద్‌నగర్ అర్బన్ : కేంద్రంలో, రాష్ట్రంలోనూ ఒకే ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని భావించిన బిహార్ ప్రజలు డబుల్ ఇంజన్ సర్కార్‌కే పట్టం కట్టారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. షాద్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమాన్ని పరిశీలిస్తున్న ప్రజలు బీజేపీ ప్రభుత్వాలనే కోరుతున్నారన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో సైతం బీజేపీ అధికారంలోకి వస్తుందని విష్ణువర్ధన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు మోహన్‌సింగ్, ఇస్నాతి శ్రీనివాస్, చిట్టెం లక్ష్మీకాంత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, గణేష్‌నాయక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

దేశంలో కాంగ్రెస్ కనుమరుగు

కందుకూరు : దేశంలో కాంగ్రెస్ పార్టీ కనుమరుగవుతోందని, రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమమని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అత్యధిక స్థానాలు కైవసం చేసుకోవడంతో శుక్రవారం సాయంత్రం పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై టపాసులు కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. నాయకులు జిట్ట రాజేందర్‌రెడ్డి, పున్న భిక్షపతి, కొంతం జంగారెడ్డి, సోమరాజు వెంకటేష్, రఘునంధన్, ప్రభాకర్, ఎస్.భూమిరెడ్డి, కె.సుధాకర్‌రెడ్డి, కె.చెన్నారెడ్డి, దయాకర్‌రెడ్డి, భానుప్రకాష్, వెంకట్‌రెడ్డి, తాళ్ల నరేందర్, తదితరులున్నారు.

దాతల సహకారం అభినందనీయం

చౌదరిగూడ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): దాతల సహకారం అభినందనీయమని ఎంఈవో కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను ఎంఈవో కాంప్లెక్స్ హెచ్ఎం సునీతతో కలిసి శుక్రవారం కాస్లాబాద్ ప్రాథమిక పాఠశాలలో గ్రామస్థులు రూ.లక్షా 81వేలతో నూతనంగా నిర్మించిన రెండు ఆదనపు తరగతి గదులను ప్రారంభించారు. పాఠశాలలో 47మంది విద్యార్థులకు ఇద్దరే టీచర్లు ఉన్నారని.. మరో టీచర్‌ను నియమించాలని గ్రామస్థులు ఎంఈవోను కోరారు. వాలంటీర్ నియామకం చేపడితే వేతనం రూ.5వేలు అందించనున్నట్లు సునీత తెలిపారు. అనంతరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

కుక్కల బెడదను అరికట్టండి

చేవెళ్ల, నంబరు 14(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో కుక్కల బెడదను అరికట్టాలని బీజేపీ చేవెళ్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు అనంతరెడ్డి, జిల్లా యువ నాయకులు డాక్టర్ వైభవ్‌రెడ్డి, కుంచం శ్రీనివాస్‌గుప్తా కోరారు. చేవెళ్ల పరిధిలో ప్రజలను నిత్యం భయాందోళనకు గురిచేస్తున్న కుక్కల పట్ల తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం బీజేపీ నాయకులు మున్సిపల్ కమిషనర్ వెంకటేశంను కలిసి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో వీధికుక్కలు ప్రజలను నానా ఇబ్బంది పెడుతున్నాయని, వీధుల్లో స్వైరవిహారం చేస్తూ దాడులకు పాల్పడుతున్నాయని వాపోయారు. అధికారులు స్పందించి కుక్కల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, అశోక్, గణేశ్, చాకలి శ్రీనివాస్, చంద్రశేఖర్‌రెడ్డి, మధుకర్, మిట్టు, శివ, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కందుకూరు, నవంబరు14(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల దృష్ట్యా మీర్కాన్‌పేట 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నేడు(శనివారం) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు ఏఈ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మీర్కాన్‌పేట, ఆకులమైలారం, మాలగూడ, భాషమాన్‌గూడ, బేగరికంచ గ్రామాల వినియోగదారులు, రైతులు సిబ్బందికి సహకరించాలన్నారు.

వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ


వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ శ్రీనివాస్

శంషాబాద్ రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సుల్తాన్‌పల్లి అమ్మ ఆశ్రమంలో సేవా భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా బాలల దినోత్సవం నిర్వహించారు. అంతకుముందు జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సామాజిక వేత్త డాక్టర్ శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా అనాథ వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ దివ్య, అమ్మ ఆశ్రమం ఫౌండర్ గోపిరాజు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీహెచ్ఎస్‌లో మాక్ పోలింగ్

చౌదరిగూడ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. సాధారణ ఎన్నికల్లో పాటించే జాగ్రత్తలు, సిబ్బంది కార్యకలాపాలు, ఓటింగ్, కౌంటింగ్ తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు జీహెచ్ఎం సునీత తెలిపారు.

ఘనంగా జాతీయ బాలల దినోత్సవం

జాతీయ బాలల దినోత్సవాన్ని జిల్లావ్యాప్తంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు ఆయన దేశానికి చేసిన సేవలను వివరించారు. వేడుకల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


ఆదిభట్ల : ప్రాథమిక పాఠశాలల్లో కేక్‌కట్ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


కడ్తాల : నెహ్రూ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ గీత, నాయకులు


కొత్తూరు : కొడిచర్ల అంగన్‌వాడీ కేంద్రంలో కేక్ కట్‌చేస్తున్న సూపర్‌వైజర్ రేవతి


కేశంపేట : దేవునిగుడి పాఠశాలలో విద్యార్థులతో సెక్టార్ అంగన్‌వాడీ సూపర్ వైజర్ దివ్యాసింగ్


చేవెళ్ల : రామన్నగూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు పంపిణీ చేస్తున్న పరమన్న చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దయాకర్

కొందుర్గు : జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేసిన రామకృష్ణారావు మిత్ర బృందం




ఆమనగల్లు : వివేకా విద్యాభారతి హైస్కూల్లో నివాళులర్పిస్తున్న మహమూద్, గోలి శ్రీనివాస్


షాద్‌నగర్ అర్బన్ : బాలల దినోత్సవంలో నారాయణ పాఠశాల చిన్నారులు, టీచర్లు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఆమనగల్లు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు పేదల ఆత్మగౌరవానికి ప్రతీక అని, అర్హులైన నిరుపేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసి సొంతింటి కలను సాకారం చేసిందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ విఠాయిపల్లికి చెందిన పలువురు లబ్ధిదారులకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో నూతనంగా ఇళ్లు మంజూరయ్యాయి. శుక్రవారం గ్రామంలో లబ్ధిదారులకు నాయకులు మంజూరు పత్రాలను అందజేశారు. పలువురి ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పర్వతాలు, శ్రీధర్ నాయక్, రవి, శ్రీను, రమేశ్, వార్డు ఆఫీసర్ సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఆమనగల్లు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): శారీర ధారుఢ్యం, మానసికోల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని సంఘ సేవకుడు పాపిశెట్టి రాము అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న 9వ జాతీయ స్థాయి అత్యాపాత్య ఫెడరేషన్ కప్ క్రీడల్లో రాము శుక్రవారం పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకున్నారు. చిన్నారులచే నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో శృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ దార్ల చిత్తరంజన్‌దాస్, నాయకుడు భాస్కర్, ఆర్గనైజర్లు అంజి, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం గ్రామ కమిటీ

ఇబ్రహీంపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి గౌడ సంఘం అధ్యక్షుడిగా గుండ్ల దానయ్యగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం జరిగిన ఈ ఎన్నికలో ఉపాధ్యక్షుడిగా భాస్కర్‌గౌడ్, కమిటీ సభ్యులుగా యాదయ్య, వసంత, స్వప్న ఎన్నికైనారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీతారామయ్య చేతుల మీదుగా వీరు నియామక పత్రాలు అందుకున్నారు.


నియామక పత్రాలు అందుకుంటున్న గౌడ సంఘం సభ్యులు

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

ఆమనగల్లు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని శుక్రవారం జరుపుకున్నారు. విద్యార్థినులు తోటి విద్యార్థినులకు బోధించిన తీరు చూపరులకు ముచ్చట గొలిపింది. ప్రతిభ కనబరిచిన వారికి టీచర్లు బహుమతులు అందజేశారు.

పేద విద్యార్థుల ఫీజు చెల్లింపు

- ముగ్గురు విద్యార్థులకు రూ.74వేలు అందజేత

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణానికి చెందిన, కోకో పామ్ రిసార్ట్స్ అధినేత బొబ్బిలి ప్రవీణ్ పేద విద్యార్థులకు ఫీజు చెల్లించి ఉదారత చాటుకున్నారు. షాద్‌నగర్ పట్టణంలోని బ్రిలియంట్ పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థుల ఫీజు రూ.74వేలను శుక్రవారం ఎంఈవో మనోహర్ చేతుల మీదుగా పాఠశాల కరస్పాండెంట్ ప్రభాకర్‌రెడ్డికి అందించారు. పేద విద్యార్థులు సైతం ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకునే విధంగా ఫీజును ఇచ్చి ప్రోత్సహించిన ప్రవీణ్‌ను ఎంఈవో ఈ సందర్భంగా అభినందించారు.

మద్దతు ధర కల్పనకే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

మాడ్గుల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మద్దతు ధర కల్పనకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతా నర్సింహ అన్నారు. మాడ్గుల మండలం నాగిళ్ల రైతువేదిక వద్ద ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, డీపీఎం లీలాకుమారి, ఏపీఎం శోభలతో కలిసి గీత ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని సూచించారు. ఏఈవో రాజేశ్, సీసీలు నర్సింహ, వెంకటయ్య, మల్లేశ్, శ్యామ్‌ప్రసాద్, గ్రామ సంఘం అధ్యక్షురాళ్లు యాదమ్మ, మల్లమ్మ, వీవోఏలు, ఏఎంసీ డైరెక్టర్ యాదయ్యగౌడ్, నాయకులున్నారు.


మాడ్గుల : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గీతా నర్సింహ, భాస్కర్‌రెడ్డి

నేడు కొనుగోలు కేంద్రం ప్రారంభం

కడ్తాల్ : మండల పరిధిలోని ముద్విన్‌లో నేడు(శనివారం) ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ తెలిపారు. ఆమనగల్లు పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కడ్తాల పీఏసీఎస్ ఉప కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో వెంకటేశ్ మాట్లాడుతూ రైతులు పండించిన పంట ఉత్పత్తులు మద్దతు ధర పొందడానికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పీఏసీఎస్ ద్వారా అర్హులైన రైతులందరికీ పంట రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ సత్యం, డైరెక్టర్ వీరయ్య, సీఈవో దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.


కడ్తాల్ : మాట్లాడుతున్న గంప వెంకటేశ్